క్లుప్తంగా

రూ.10 లక్షల ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ శివరామకృష్ణ

త్రిపురాంతకం: బీమా పథకాలు వినియోగించుకుంటే బ్యాంకు ఖాతాదారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ వై. శివరామకృష్ణ పేర్కొన్నారు. త్రిపురాంతకం ఎస్‌బీఐ ద్వారా బ్యాంకు ఖాతా కలిగి, బీమా పథకం కోసం సంవత్సరానికి ఐదువందలు చెల్లించిన ఖాతాదారు, రాజుపాలెం గ్రామానికి చెందిన ఉప్పు సామ్రాజ్యం మృతి చెందడంతో ఆమె కుమారుడు హనుమంతరావుకు పది లక్షల రూపాయల నగదు చెక్కును అందించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ వి శ్రీనుబాబు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గృహసారథులతో సమావేశం

మార్కాపురం టౌన్: పట్టణ పరిధిలోని 1 నుంచి 10 సచివాలయాలు, 10 నుంచి 17 వార్డుల పరిధిలోని కౌన్సిలర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో ఆదివారం సాయంత్రం 4 30 గంటలకు తర్లుపాడు రోడ్డులోని డ్వాక్రా బజారులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

గుంటూరు వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్



పింఛన్ అందిస్తున్న వలంటీర్ అంజి

మార్కాపురం: మండలంలోని కొండేపల్లికి చెందిన మండ్ల కాశయ్య అనారోగ్యంతో గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామానికి చెందిన వలంటీర్ పరిసినేని అంజి శనివారం గుంటూరు వైద్యశాలకు పింఛన్ అందించారు. గ్రామస్తులు అంజిని అభినందించారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



కలనూతలలో క్యాన్సర్ వ్యాధి చిహ్నమైన ఎండ్రకాయ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పెద్దారవీడు: మండలంలో కలనూతల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హెచ్ఎం సుధాకర్ క్యాన్సర్‌పై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి.. పొగాకు, ఆల్కహాల్, నిషేధిత మందులు, రసాయన ఆహార పదార్థాలు, కార్సినోజెనిక్ పదార్థాల ప్రభావం వలన కలుగుతుందని, వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడా జ్యోతితో సీఐ భీమానాయక్

మార్కాపురం టౌన్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సీఐ భీమానాయక్ కోరారు. క్రీడా దినోత్సవాన్ని శనివారం స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు, డీవీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం నేడు

కురిచేడు: శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక పాత పోలీసుస్టేషన్ వద్ద, కోన వల్లభరాయస్వామి కొండపై, మండలంలోని పేరంబొట్లపాలెంలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం కల్యాణం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటారు.

గృహ సారథులు..జగనన్న సైనికులు

- ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కష్టపడి పని చేసే వారికే వైఎస్సార్ సీపీలో గుర్తింపు
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వేదికపై వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి రూరల్: గృహసారథులు.. జగనన్న సైనికులని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పొదిలి సాయి బాలాజీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కే నూర్జహాన్ బేగం, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు గొలమారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కొత్తగా ఎంపికైనా గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఆలోచన నుంచి పుట్టిందే గృహసారథుల వ్యవస్థ అన్నారు. గతంలోలా ఏ పథకం రావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేసి వారిని ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్లు ద్వారా కుల,మతాలకు అతీతంగా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. అయినా ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. అటువంటి వారి నోటికి తాళం వేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారింటి వద్దకే వెళ్లి తెలుసుకుని పరిష్కరించేందుకు 50 నివాసాలకు ఇద్దరు చొప్పున గృహసారథులను నియమించినట్లు తెలిపారు. వీరిని పర్యవేక్షించేందుకు సచివాలయాల కన్వీనర్లు ఉంటారన్నారు. ఇక నుంచి గృహసారథులు వలంటీర్లతో అనుసంధానమై పని చేయాలని సూచించారు. 2024 లక్ష్యంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా అంతా కలిసి సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం గృహసారథులు, వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ మండల కన్వీనర్లు జి.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, జూపల్లి ఏడుకొండలు, నగర పంచాయతీ బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పులిగొర్ల శ్రీనివాసులు, ఫిరోజ్, మల్లాపురం నరసింహులు, బ్రహ్మారెడ్డి, వినోద్, బందీసాహెబ్, జాకీర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

గిద్దలూరు రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ఏ విధంగా కృషి చేశారో ఆయన తెలుసుకున్నారు. నగర పంచాయతీ పరిధిలోని 1 నుంచి 5వ సచివాలయం అర్జీలపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అధికంగా రేషన్‌కార్డులు, ఇంటి స్థలం కావాలంటూ అర్జీలు పెట్టుకున్నారు. అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చూడాలని ఎమ్మెల్యే అన్నా ఆదేశించారు. అధికారులు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతూ వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బంగారు శ్రీనయ్య, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య, తహసీల్దార్ బి.రమాదేవి, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపిక, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ వైవీకి ఘన స్వాగతం



వైవీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శనివారం రాత్రి మండలంలోని కోమటికుంట వద్ద ఘన స్వాగతం పలికారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వైవీ నంద్యాల నుంచి రోడ్డు మార్గం ద్వారా యర్రగొండపాలెం వెళ్తున్నారు. కోమటికుంట వద్ద ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ నాయకులు వైవీకి ఘన స్వాగతం పలికారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, కౌన్సిలర్ బుసెట్టి నాగేశ్వరరావు ఉన్నారు.

ఆలయ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాతాళ నాగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, వినాయకుడి ఆలయాల పనులను పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఆ రోజు కల్యాణం నిర్వహించే సమయంలో ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు? బండ పందెం, స్వామివారి ప్రభ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు అటవీ శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శీనయ్య, సీఐ ఫిరోజ్, ఎస్ఐ బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయభాస్కర్

గిద్దలూరు రూరల్: ఉపాధ్యాయులు విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయభాస్కర్ అన్నారు. పట్టణంలోని యాదవ బజారు ఎంపీయూపీ స్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభ పటన శక్తిని పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. విద్యార్థులకు బోధించే విద్యపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కొమరోలు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారిని తీర్చిదిద్దాలని డీఈఓ విజయభాస్కర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. నిర్మాణంలో ఉన్న నూతన తరగతి భవనాలను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేసి ఆ గదులను వాడుకలోకి తేవాలని సూచించారు. అనంతరం తరగతులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు జీవిత లక్ష్యాలు ఎలా చేరుకోవాలో తెలిపారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. మంచి ఉత్తీర్ణతతో 10వ తరగతి విద్యార్థులు ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంఐఎస్‌కో ఆర్డినేటర్ పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన



శిక్షణ పొందిన విద్యార్థులతో సిబ్బంది

మార్కాపురం: డాక్టర్ సామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో స్కిల్ డెవలెప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బి.ఫార్మసీ విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. ఇంటర్వ్యూ ఫేసింగ్, కంప్యూటర్ స్కిల్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



బహుమతులు అందిస్తున్న ఎంఈఓ, దార్ల

తాళ్లూరు: భారత రాజ్యాంగంపై ప్రతి విద్యార్థి చిన నాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని మండల విద్యా శాఖాధికారి జి.సుబ్బయ్య అన్నారు. రిపబ్లిడే సందర్భంగా దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. డీబీఆర్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుజీత, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

పొదిలి పెద్ద చెరువు పనులకు త్వరలో శంకుస్థాపన

- ఇంటింటికి కుళాయి కోసం రూ.7.26 కోట్లు మంజూరు
- రామతీర్థం నుంచి సాగర్ నీటి సరఫరాకు రూ.1.10 కోట్లు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ, అధికారులు

పొదిలి రూరల్: పొదిలి పెద్ద చెరువు పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ పొదిలిలో 2018 ఫిబ్రవరి 17న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ పొదిలి పెద్ద చెరువును సమ్మర్ స్టోరేజీ చేసి దర్శి నుంచి పైపులైన్ ద్వారా నీరు నింపేందుకు రూ.50.13 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. దానికి సంబంధించి టెండర్ కూడా వేశారన్నారు. పొదిలి పెద్ద చెరువు పనులకు 10–15 రోజుల్లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అంతే కాకుండా పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.7.26 కోట్ల మంజూరయ్యాయని పేర్కొన్నారు. రామతీర్థం నుంచి పొదిలికి పైపులైన్ ద్వారా సాగర్ నీరు సరఫరా చేసేందుకు మరో రూ.1.10 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కేపీ వివరించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ఎస్ఈ సి.గోపాల్‌రెడ్డి, ఈఈ జానీ, డీఈ ఆదాంషాఫీ, ఏఈ రవీంద్రుడు, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, గొలమారి చెన్నారెడ్డి, కె.నరసింహారావు పాల్గొన్నారు.

నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా యక్కలి

- ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలక మండలి
- ఆలయాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ సూచన



నూతన పాలక మండలితో ఎమ్మెల్యే కేపీ

పొదిలి రూరల్: భగవంతుని సేవతో పాటు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. పొదిలి నిర్మమహేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక శివాలయంలో శనివారం ఉదయం జరిగింది. ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరైనా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పన, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పదవి అజమాయిషీ కోసం కాదని, దేవుని సేవకు అవకాశంగా గుర్తించాలన్నారు. శివరాత్రి ఉత్సవాలు, పండగలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. పాలక మండలి చైర్మన్ యక్కలి శేషగిరిరావు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆలయానికి చైర్మన్‌గా సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

సాదాసీదాగా ప్రమాణస్వీకారం

పొదిలి నిర్మమహేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఎటువటంటి హంగూ ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. తొలుత పాలక మండలి సభ్యులు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదయ శాఖ నిబంధనల ప్రకారం అధికారులు ఎనిమిది మంది సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎనిమిది మంది సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకోవాల్సి ఉండగా వారిలో యక్కలి శేషగిరిరావు పేరును సభ్యులంతా సూచించారు. ఆయన్ను చైర్మన్‌గా ప్రకటించారు. ఆయనతో పాటు కొలగట్ల అంజిరెడ్డి, గొలమారి నాగమణి, పులుకూరి నాగేశ్వరరావు, మునగాల లక్ష్మీ సుజాత, పావులూరి నాగమణి, గంజి సుబ్బారావు, అర్చకులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా సుబ్బ నరసయ్యలను సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితో కందుకూరు డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలక మండలిని ఎమ్మెల్యే కేపీ అభినందించారు. అనంతరం నూతన పాలక మండలి సభ్యులు అధికారులు, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆలయ కార్యనిర్వాహాధికారి జె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ కన్వీనర్లు జి.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ నరసింహారావు, వినోద్, ఫిరోజ్ పాల్గొన్నారు.

జగనన్న గృహాలు త్వరితగతిన నిర్మించుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు: జగనన్న శాశ్వత గృహాలు త్వరితగతిన నిర్మించుకొని సొంత గృహానికి యజమానులు కావాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మాధవరం జగనన్న కాలనీలో నూతన గృహాలు నిర్మించుకోనున్న లబ్ధిదారులతో శనివారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ నివాసం లేని ప్రతి పేదవారికి సొంత స్థలం, నివాసం కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సహకారంతో స్థలాలు, గృహాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకుని అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వారికి బిల్లులు, ఇతర సామగ్రి త్వరగా అందేలా తగిన చర్యలు తీసుకుంటానని, ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీపీ కోరారు. హౌసింగ్ ఏఈ మనోహర్, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు నుసుం అంజనేయులు, ఇడమకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ప్రజాప్రతినిధులు



వివరాలు నమోదు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో సుమారు 16 మంది అస్వస్థతకు గురై శుక్రవారం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు శనివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన కారణాలు, లోపాలు ప్రత్యేకాధికారి అరుణను అడిగి తెలుసుకున్నారు. బాలికల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని విషయం తెలుసుకుని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహులు శనివారం తనిఖీ చేశారు. బాలికలు మార్కాపురం వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లి వైద్యాధికారితో మాట్లాడారు. బాలికలు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారని వైద్యాధికారులు తెలిపారన్నారు. బాలికలకు పాలల్లో ఎక్కువ మిరియాలు కలపడంతో అస్వస్థతకు కారణమన్నారు. 30 రకాల సరుకులు గుంటూరు ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. నివేదికను డైరెక్టర్ పూర్ణచంద్రరావుకు, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జె.నివాస్‌కు, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు అందజేస్తామన్నారు. ల్యాబ్‌లోని రిపోర్ట్ ఆధారంగా ఫుడ్ పాయిజన్‌తో ఇన్‌ఫెక్షన్ జరిగినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని నరసింహారావు హెచ్చరించారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

తాళ్లూరు: తాళ్లూరు–కుంకుపాడు రోడ్డులో దొర్నప్ప వాగు బ్రిడ్జిపై శనివారం ఇసుక టిప్పర్ వెనక్కి వస్తూ అదుపుతప్పి బోల్తా కొట్టింది. కుంకుపాడు వైపు మొక్కజొన్న లోడ్‌తో వెళ్తున్న లారీ దోర్నప్ప వాగు స్కీమ్ వద్ద రోడ్డు పూర్తిగా కుంగి టిప్పర్ దిగబడి పోయింది. విషయం తెలియని డ్రైవర్ అద్దంకి వైపు వెళ్లేందుకు ప్రయత్నించి బ్రిడ్జిపై కొంతదూరం రాగానే విషయం గమనించి వెనక్కి మళ్లి వెళ్లే ప్రయత్నం చేశాడు. బ్రిడ్జి అంచులు బలహీనంగా ఉండటంతో టైరు కుంగి నిదానంగా ఒక పక్కకు ఒరిగి పోయింది. డ్రైవర్ పక్కకు రావడంతో ప్రమాదం తప్పింది.

బొలెరో ఢీకొని రెండు గేదెలు మృతి

పొదిలి రూరల్: బొలెరో ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని కంభాలపాడు వద్ద శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన బత్తుల శ్రీరామిరెడ్డి గేదెలు పొలానికి మేతకు తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా పొదిలి నుంచి గిద్దలూరు వైపునకు వెళ్తున్న బొలెరో వాహనం కంభాలపాడు మిట్టపాలెం వద్ద ఢీకొంది. ప్రమాదంలో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందగా మరో గేదె తీవ్రగాయాలతో సాయంత్రం మృతి చెందింది. ఒక్కో గేదె విలువ లక్ష రూపాయులు ఉంటుందని గేదె యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో పలు ఫెర్టిలైజర్స్ దుకాణాలను వ్యవసాయాధికారి ప్రసాదరావు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. మిరపలో తామర పురుగుల నివారణకు సమర్థంగా పనిచేస్తోందంటూ రకరకాల మందులు వస్తున్నాయని, దాన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించి తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, రైతులు కూడా బిల్లులు తీసుకోవాలని కోరారు. వ్యాపారులు తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలని, స్టాక్‌కు, రికార్డులకు తేడాలు ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రయాణికులకు సూచనలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ముండ్లమూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని అద్దంకి– దర్శి ప్రధాన రహదారిలో నో యాక్సిడెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేంపాడు వద్ద వాహనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. హెల్మెట్ ప్రాధాన్యతను ప్రతి వాహనదారుడు గుర్తించాలన్నారు. కూలీల ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఇబ్బందులు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

బేస్తవారిపేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ మాధవరావు కోరారు. శనివారం మండలంలోని పందిళ్లపల్లె టోల్‌ప్లాజా, బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మరణాలు తలకు గాయాలు కావడంతోనే జరుగుతున్నాయన్నారు.